# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశవ్యాప్తంగా "స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభిస్తారు.
2. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు నిఘా పెంచాలని జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు.
4. తెలంగాణలో కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
5. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.

==========================

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ రోజు నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు "స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రాథమిక, పట్టణ, ప్రాంతీయ, జిల్లా, ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు చికిత్స అందిస్తారు.

దేశ వ్యాప్తంగా ఈరోజు నుంచి "స్వస్త్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్" ప్రారంభమవుతుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వైద్య శిబిరాలను ప్రారంభిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నంలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.

--------------------------

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా 'తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు' అనే అంశంపై నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభించే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే సాయంత్రం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ వాణిజ్య సదస్సులో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు నిఘా పెంచాలని జిల్లా

ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతల అంశంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, శాంతిభద్రతల విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని, నేరాల శాతం తగ్గేలా పోలీస్ యంత్రాంగం కృషి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 26.. సెకన్లు

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. సేవా పర్వ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రయాణంపై ప్రముఖుల స్పందనలను ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 10)

---------------------------

తెలంగాణలో కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుకు పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో విద్యుత్‌శాఖ పనితీరుపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయం, ఎత్తిపోతలు, గ్రామీణ మంచినీటి సరఫరా పథకాలు, హైదరాబాద్ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్ లైన్ల నిర్మాణంపై అధ్యయనం చేసి అవసరమైన పూర్తిస్థాయి ప్రణాళికలు డిసెంబరులోగా రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

'పరిశుభ్రమైన భారతదేశం'ను సృష్టించే దార్శనికతతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఒక జాతీయ ఉద్యమంగా ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ రోజు నుండి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం 'స్వచ్ఛోత్సవ్' ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

---------------------------

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ.. హైదరాబాద్ సంస్థానంలో మాత్రం మరో 13 నెలల పాటు నిజాం పాలన సాగింది. చివరికి నాటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేతృత్వంలో 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వ 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. దీంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌ను విముక్తి చేసిన అమరవీరులను స్మరించుకోవడానికి, యువతలో దేశభక్తి స్ఫూర్తిని నింపడమే ఈ దినోత్సవ నిర్వహణ లక్ష్యం.

కాగా సెప్టెంబర్ 17ను తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా' నిర్వహిస్తోంది.

-----------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మార్పులను వర్తకులు స్వాగతిస్తున్నారు. జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించడం ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు ఈ మార్పులు దోహదపడతాయని విశాఖపట్నానికి చెందిన స్థానిక వ్యాపారి ఆకాశవాణికి తెలియజేస్తూ,

వాయిస్ 24 సెకన్లు

-----------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ నెలను పోషకాహార మాసంగా నిర్వహిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చి దిద్దడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఇందు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించాలన్న ఉద్దేశ్యంతో ఈరోజు నుంచి అక్టోబర్ 17 వరకు పోషకాహార మాసంగా నిర్వహిస్తున్నారు. బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు పలు కార్యక్రమాలు కొనసాగుతాయి.

పోషకాహార లోపాన్ని నివారించడానికి జరిగే కార్యక్రమంలో ప్రజలంతా విస్తృత స్థాయిలో భాగస్వామ్యం కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిస్తూ...

వాయిస్ .. 26 సెకన్లు

-----------------------------

దక్షిణ అంతర కర్ణాటక, తమిళనాడు మీదుగా ఉత్తర్, దక్షిణ ద్రోణి విస్తరించిందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================